క్లుప్తంగా

కొనసాగుతున్న ప్రవచనలు

నెల్లూరు(బృందావనం): సనాతన ధర్మ పరిరక్షణ, హైందవ సంరక్షణకే ఆదిశంకరాచార్యులు అవతరించారని నరసింహకొండ వేదగిరి ఆశ్రమ మఠాధిపతి మహేశానందస్వామి ప్రవచించారు. పొగతోటలోని చక్రాల వారి ట్రస్ట్ ఆదిశంకర ధ్యాన మందిరంలో నిర్వహిస్తున్న ఆదిశంకరాచార్యులు సంస్మరణోత్సవాల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఉపన్యసించారు. హైందవ ధర్మరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం మహేశానందస్వామిని సత్కరించారు. ఆంజనేయవరప్రసాదరావు, స్వామి సమయానంద, ఆనందకుమార్, సీతారామప్రసాద్, మురళీకృష్ణ, కృష్ణారెడ్డి, సుభద్రాదేవి, శ్రీహరిప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ - కేవైసీని తప్పక చేయించుకోవాలి

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్లు ఈ - కేవైసీని తప్పక చేయించుకోవాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సుమారు 20 వేల మంది పింఛనర్ల కోసం వివిధ ప్రాంతాల్లో ఏడు ఈ - కేవైసీ కేంద్రాలను ఏర్పాటు చేశారని వివరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా ట్రెజరీ, రైల్వేఫీడర్స్ రోడ్డులోని నెల్లూరు డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయాలు, దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్, మూలాపేటలోని గోవిందరెడ్డి సరస్వతీ సమాజ భవనం, ఏసీనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల, ఆచారివీధిలోని పాత జెడ్పీ కార్యాలయం, భక్తవత్సల నగర్‌లోని జిల్లా పింఛనర్ల సంక్షేమ సంఘ భవనంలో ఈ - కేవైసీ కేంద్రాలను ప్రారంభించారని చెప్పారు. ఈ - కేవైసీని ఈ నెల తొమ్మిదిలోపు చేయించుకోవాలని కోరారు.

విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం

నెల్లూరు (టౌన్): ఇంటర్ ఫెయిలై ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థినుల కోసం నగరంలోని డీకేడబ్ల్యూలో వసతి సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని ఆర్ఐఓ వరప్రసాద్‌రావు, డీవీఈఓ మధుబాబు పేర్కొన్నారు. డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను గురువారం పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులవ్వాలని కోరారు. ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్పాస్టిక్స్ సెంటర్‌కు రూ.25 వేల విరాళం

నెల్లూరు (అర్బన్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో ట్రెడ్ మిల్ కొనుగోలుకు రూ.25 వేల విరాళాన్ని ప్రకటించారు. తన కుమార్తె ప్రియాంక జయంతిని పురస్కరించుకొని పీఎన్నార్ అధినేత సీతారామాంజనేయులు ఈ మొత్తాన్ని గురువారం అందజేశారు. కేంద్ర ప్రిన్సిపల్ గుర్నాథరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, రెడ్ క్రాస్ సెక్రటరీ మస్తానయ్య, విశ్వబ్రాహ్మణ సంఘ పూర్వ రాష్ట్ర కార్యదర్శి కుమార్, బాలసుబ్రహ్మణ్యం, మధుసూదన్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వరరావు

నెల్లూరు(బారకాసు): ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా నాగేశ్వరరావును నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ఉత్తర్వులను గురువారం జారీ చేసింది. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఎన్నికల సెల్ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రమేష్‌బాబు 40 రోజుల పాటు సెలవుపై వెళ్తున్న నేపథ్యంలో నాగేశ్వరరావును నియమించారు.

నిర్మాణ పనులు వేగవంతం

నెల్లూరు(బారకాసు): నుడా భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంస్థ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీనగర్‌లో నిర్మిస్తున్న నుడా భవన పనులను అధికారులతో కలిసి గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కోరారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందుగా శ్రీరామగానామృతం

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీరామగానామృతాన్ని శ్రీకంఠేశ్వరస్వామి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పెంచలకోనలో నిర్వహిస్తున్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టామని నిర్వాహకుడు కేతా సుబ్బారావు తెలిపారు. జయకృష్ణ, రామస్వామి, విజయన్ వాద్య సహకారం అందించారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మంత్రి కాకాణికి వినతిపత్రమిస్తున్న విశ్వబ్రాహ్మణ నేతలు

మనుబోలు: విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మనుబోలుకు చెందిన విశ్వబ్రాహ్మణ నేతలు మంత్రిని నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మనుబోలులో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. కాగితాలపూరులో విశ్వబ్రాహ్మణుల శ్మశాన వాటిక ఆక్రమణకు గురవుతోందని, దీనికి హద్దులు చూపి ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కాగా తహసీల్దార్ లక్ష్మీనారాయణతో మాట్లాడి శ్మశానానికి హద్దులు చూపాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధులతో శ్మశాన వాటికను త్వరలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయ నిర్మాణానికి భూమిని కేటాయిస్తామని తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు రాము, గౌరవాధ్యక్షుడు జగదీష్‌బాబు, మునికృష్ణయ్య, శ్రీహరి, కిషోర్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నందిసేవ


నందిసేవలో ప్రసన్న విశ్వేశ్వరుడు


గరుడ వాహనసేవలో చెన్నకేశవస్వామి

ఇందుకూరుపేట: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామికి నందిసేవను వేడుకగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవాన్ని జరిపారు. ఆలయ అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉభయకర్తగా వేణుగోపాల్‌రెడ్డి వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సురేంద్రబాబు, ఈఓ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

• కొమరికలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహనసేవను నిర్వహించారు. ఆలయ అర్చకుడు తులసీరామ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వెంకటబాలకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పందులను ఊరికి దూరంగా పెంచాలి


మాట్లాడుతున్న ప్రత్యూష

ముత్తుకూరు: పంచాయతీలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులను ఊరికి దూరంగా పెంచేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ప్రత్యూష పేర్కొన్నారు. ముత్తుకూరు పంచాయతీ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని గురువారం నిర్వహించారు. పది రోజుల గడువిస్తే చెరువుకట్టపై ఆవాసం ఏర్పాటు చేసి, పందులను తరలిస్తామని పెంపకందారులు తెలిపారు. ఊరికి ఐదు కిలోమీటర్ల దూరంలో పందుల కోసం ప్రత్యేక స్థలాన్ని ఆర్నెల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం సభ్యుల ఆమోదంతో ఎంపీడీఓ తీర్మానం చేశారు. ఈలోపు గ్రామంలో సంచరిస్తే పంచాయతీ సిబ్బంది ద్వారా ఊరికి దూరంగా తరలిస్తామన్నారు. సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు నవీద్‌బాషా, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో సీహెచ్‌సీ గ్రూపులను రూపొందించాలి


మాట్లాడుతున్న సుజాత

కొడవలూరు: ప్రతి ఆర్బీకేలో కమ్యూనిటీ హైరిస్ సెంటర్ (సీహెచ్‌సీ) గ్రూపును విధిగా రూపొందించాలని కోవూరు ఏడీఏ సుజాత పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండలంలోని వీఏఏలతో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. మండలంలో 16కు గానూ 14 ఆర్బీకేల్లో సీహెచ్‌సీ గ్రూపులను రూపొందించి రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను పొందారని చెప్పారు. మిగిలిన రెండు ఆర్బీకేల్లోనూ గ్రూపులను ఈ నెల 12లోపు రూపొందించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్ని ఆర్బీకేల్లో ఎరువులు తగిన మేర నిల్వ ఉండేలా ఇండెంట్లు పెట్టి సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పీఎం కిసాన్ ఈ - కేవైసీకి గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించారని, రైతులు విధిగా చేయించుకునేలా వీఏఏలు కృషి చేయాలని సూచించారు. ఏఓ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సీఆర్ రెడ్డి


మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: ప్రజా వైద్యుడిగా గూడూరు వాసులకు విశేష సేవలందించిన దివంగత చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి (సీఆర్ రెడ్డి) ఆదర్శప్రాయుడని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయ డెయిరీ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి తండ్రి సీఆర్ రెడ్డి అంత్యక్రియలను గూడూరులోని వారి నివాసంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి మంత్రి నివాళులర్పించారు.

విద్యా కానుక స్టోరేజీ పాయింట్‌లో పరిశీలన



కొడవలూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక స్టోరేజీ పాయింట్‌ను ఎంఈఓ వసంతకుమారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యాకానుక కిట్లను ఇక్కడ భద్రపర్చనున్న నేపథ్యంలో గదుల సౌకర్యాన్ని పరిశీలించామని చెప్పారు. ఏపీఎం రుక్మిణి, సీఆర్పీ పెంచలరావు, విద్యాశాఖ సిబ్బంది సునీత, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న నేతలు

కొడవలూరు: జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వెంకటశేషయ్య పేర్కొన్నారు. మండలంలోని పాతవంగల్లులో గురువారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలను సీఎం ప్రవేశపెట్టారని చెప్పారు. పార్టీ నేతలు యుగంధర్‌సింగ్, మల్లయ్య, సోమిరెడ్డి, మునికృష్ణ, శ్రీనివాసులురెడ్డి, నాగరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ శిక్షణ శిబిరం ప్రారంభం



ఇందుకూరుపేట: కబడ్డీ క్రీడకు మంచి భవిష్యత్తు ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వేసవి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని సుహాసిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కబడ్డీ క్రీడాకారుడు శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరావు, పీడీ అరోరా, సుహాసిని స్పోర్ట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు విజయ్‌కుమార్, కోచ్ వెంకటకృష్ణ, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో విశేష పూజలను గురువారం నిర్వహించారు. అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల భజనలు, స్వామివారికి పల్లకీసేవను నిర్వహించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

కృష్ణపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం నేడు

ముత్తుకూరు: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని కృష్ణపట్నం పంచాయతీలో శుక్రవారం నిర్వహించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరుకానున్నారని చెప్పారు.

లేబూరులో నేడు

ఇందుకూరుపేట: మండలంలోని లేబూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం నిర్వహించనున్నారని ఏపీఎల్డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు, నేతలు పాల్గొనాలని కోరారు.

టిప్పు సుల్తాన్‌కు నివాళి

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక సీపీఎం కార్యాలయంలో టిప్పు సుల్తాన్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆవాజ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, జక్రియా అహ్మద్, ఉపాధ్యక్షుడు జానీబాషా, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు, నేతలు శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.

రంగనాథుడికి బంగారు గరుడసేవ

నెల్లూరు(బృందావనం): నృసింహ జయంతిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామి వారికి బంగారు గరుడసేవను వేడుకగా గురువారం నిర్వహించారు. ఉభయకర్తగా రాజాహజరత్‌బాబు వ్యవహరించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి హనుమంతసేవ

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలను గురువారం నిర్వహించారు. స్వామివారికి చప్పరోత్సవం, పూలంగిసేవ, హనుమంతసేవను శాస్త్రోక్తంగా జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పర్యవేక్షించారు.

లక్ష్మీనృసింహ అలంకారంలో కృష్ణ భగవానుడు

నెల్లూరు(బృందావనం): నృసింహ జయంతిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిరంలో కొలువైన కృష్ణ భగవానుడు లక్ష్మీనృసింహస్వామి అలంకారంలో గురువారం దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం చేశారు. మందిర ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

నెల్లూరు (టౌన్): పూర్వ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని భగత్ స్టూడెంట్స్ యూనియన్ నేతలు బాబీ భగత్, అమృత్‌కుమార్ పేర్కొన్నారు. రామలింగాపురంలోని జగన్స్ కళాశాల ముందు ధర్నా నిర్వహించాలని వచ్చిన యూనియన్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఫీజులతో సంబంధం లేకుండా పూర్వ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాశీ విశ్వనాథుడికి నంది సేవ

నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి గిన్నె భిక్ష, నందిసేవను గురువారం జరిపారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు విశ్వనాథ గురుకుల్, గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా సుధాకర్, పద్మకుమారి, కిషోర్‌కుమార్, అరుణలత దంపతులు వ్యవహరించారు.

చలివేంద్రం ప్రారంభం



పొదలకూరు: స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చినబ్రహ్మయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెంచలకోన బ్రహ్మోత్సవాల సందర్భంగా బస్టాండ్‌లో మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించడం శుభపరిణామమన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రోత్సాహంతో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు వాసుదేవరావు, భాస్కర్, హరి, నేతలు భాస్కర్‌రావు, శివప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

కొడవలూరు: ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్లు పొందేందుకు సంబంధించిన గడువును ఈ నెల 15 వరకు పొడిగించారని ఎంఈఓ వసంతకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు వారి పరిధిలోని సచివాలయాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పిల్లలు నివాసం ఉంటున్న ప్రాంతాల సమీపంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం కప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ



కోవూరు: తిరుపతిలోని తారకరామా స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో కోవూరు బాలికోన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు పతకాలను సాధించారని పాఠశాల పిజికల్ డైరెక్టర్ దేవిక తెలిపారు. బాక్సింగ్‌లో సైతం ఉత్తమ ప్రతిభను చూపారన్నారు. నమ్రత, జయంతి, కీర్తన, జయంతిసింగ్, ముతహర్, హర్షిణి పతకాలను సాధించారని చెప్పారు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి


మాట్లాడుతున్న రంగప్రసాద్

కోవూరు: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో చేపట్టే అన్ని నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పక పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగప్రసాద్ పేర్కొన్నారు. కోవూరులోని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయంలో గురువారం నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పనుల్లో ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ఈజీఏపీ ద్వారా 615 పనులకు రూ.23.24 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇందులో 262 పనులు పూర్తి కాగా, 162 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. డీఈ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో బదిలీలు నిర్వహించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు బదిలీలను నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాలకు సంబంధించిన యూటీఎఫ్ నేతలకు వర్క్‌షాపును నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు నవకోటేశ్వరరావు, రఘుపతిరెడ్డి, ఎస్సెస్ నాయక్, జిల్లా బాధ్యులు చలపతిశర్మ, శేషు, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): రైలు నుంచి జారిపడటంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై గురువారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 55 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు కలిగి.. ఆరెంజ్, గ్రే రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, నలుపురంగుపై తెలుపు, బ్లూ, ఎరుపు రంగు డిజైన్ల గల షార్ట్‌ను ధరించి ఉన్నారు. మృతుడి ఎడమ చేయి ఆపరేషన్ ద్వారా తొలగించినట్లు ఉంది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

నూనె పడి వివాహితకు గాయాలు

నెల్లూరు(క్రైమ్): కాగే నూనె పడి వివాహిత గాయపడిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నేతాజీనగర్‌లో నివాసం ఉంటున్న షబానా కుటుంబం వారి ఇంటి వద్ద సమోసాలు తయారు చేసి దుకాణాలకు సరఫరా చేస్తుంటారు. ఈ నెల రెండున తన భర్తతో కలిసి సమోసాలు కాలుస్తుండగా, గ్యాస్ పైప్ లీకై మంటలు వ్యాపించాయి. షబానా తన భర్తను దూరంగా నెట్టేసి మంటలను ఆర్పుతుండగా, కాగుతున్న నూనె ఆమె శరీరంపై పడి గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆమెను హుటాహుటిన జీజీహెచ్‌లో చేర్పించారు. ఘటనపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువకుడు అదృశ్యమైన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని గోపీ టీ సెంటర్ సమీపంలో నివాసం ఉంటున్న రమా చిన్న కుమారుడు విష్ణువర్ధన్ హరనాథపురంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నారు. పని ఉందని చెప్పి గత నెల 30వ తేదీ రాత్రి బయటకెళ్లారు. ఇంటికి రాకపోవడంతో ఆయన ఫోన్‌కు కుటుంబసభ్యులు ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సంతపేట పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.